ప్రజాశక్తి

శుక్రవారం 18 జూలై 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పేదవారా ? కాదా ?

◆ బంగారు కుటుంబాల రీ సర్వేకు కసరత్తు

◆ తొలి దశలో విశాఖ జిల్లాలో 73,949 కుటుంబాల గుర్తింపు

◆ సాయం కోసం ఒక్క సంపన్నుడూ ముందుకు రాని వైనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జిల్లాలో బంగారు కుటుంబాల రీ సర్వేకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే గుర్తించిన కుటుంబాల్లో పేదలెంతమంది ? అన్నది నిర్దిష్టంగా ధ్రువీకరించుకోవడమే దీని ఉద్దేశ్యమని అధికారులు చెబుతున్నారు. పేద, ధనిక అంతరాలు తగ్గించేందుకు పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్ (పి-4) అమలు ద్వారా ముందుకెళ్తాంటూ బంగారు కుటుంబాల తయారీకి రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్‌లకు దీనికి సంబంధించిన నమూనా పత్రాలను పంపింది. పేదవారిని గుర్తించేందుకు ఐదు ప్రశ్నలతో తయారు చేసిన సర్వే కూడా చేపట్టింది. విశాఖ జిల్లాలో 22.50 లక్షల మంది జనాభాలో మొదటి దశలో 73,949 మంది పేదలను బంగారు కుటుంబాలకు అర్హులుగా జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యాన గుర్తించారు. ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఈ వివరాలను సిపిఒ కార్యాలయ అధికారులు ఇప్పటికే పొందుపరిచారు. మరో దఫా 'రీ వేలిడేషన్' కోసం గ్రామ పంచాయతీ, సచివాలయాల ద్వారా సర్వేను ప్రభుత్వం గురువారం నుంచి చేపట్టింది. ఇప్పటి వరకూ గుర్తించిన వారందరినీ మరో దఫా గ్రామసభల్లో పరీక్షించనున్నారు. 'పేదవారా ? కాదా ?' అన్నది ధ్రువీకరి ంచుకునేందుకు ఐదు ప్రశ్నలతో కూడిన పత్రాన్ని వారికి ఇచ్చి వివరాలను నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొద్ది వారాల్లో ఈ సర్వే కూడా పూర్తి కానుంది. స్థానిక పరిశ్రమలకు ఈ కుటుంబాలను దత్తత ఇవ్వాలన్నది ప్రభుత్వ విధానంగా ఉంది. ఏ నియోజక వర్గంలో పేదలను ఆ అసెంబ్లీ సెగ్మెంట్‌లోగల పరిశ్రమల అధిపతులకు అప్పగించాలన్నది దీని ఉద్దేశం. ఇలా పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చేందుకుగానూ సంపన్నులైన కొంతమంది సాయం తోడ్పడుతుందని ప్రభుత్వ భావన. 'మార్గ దర్శుల సాయం'తో 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం మిగతా 2లో..

సర్వే చేపడుతున్న అధికారులు (ఫైల్ ఫోటో)

హెచ్‌ఎస్‌ఎల్ తయారు చేసిన నిస్తార్ నౌక

నేడు నిస్తార్ జలప్రవేశం

ముఖ్య అతిథిగా హాజరుకానున్న
కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేత్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ డైవింగ్ సపోర్టు నౌక నిస్తార్ శుక్రవారం జలప్రవేశం చేయనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేత్, నావికా దళ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠీ హాజరుకానున్నారు. విశాఖ పట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఈ నౌకను నిర్మించగా 120 ఎమ్‌ఎస్‌ఎంఇ కంపెనీలు భాగస్వా మ్యమయ్యాయి. అంతేకాకుండా 80 శాతం కంటే ఎక్కువ స్వదేశీ పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ నౌకను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా భారతదేశ సామర్థ్యాన్ని చాటి చెప్పే విధంగా నిర్మించారు.

ఈ నౌక 10.5 వేల టన్నుల బరువుతో దాదాపు 120 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు ఉంటుంది. ప్రధానంగా డీప్ సీ డైవింగ్ చేపట్టడం, విపత్తులలో ఉన్న జలంతర్గాముల నుంచి రెస్క్యూ ఆపరేషన్స్ నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టనుంది.

టిడ్కో గృహాలన్నింటికీ మౌలిక సదుపాయాలు

▶ వార్త 2లో..

మధ్య తరగతికి ఇబ్బంది లేకుండా మాస్టర్ ప్లాన్

▶ వార్త 2లో..

26, 27న సిఐటియు విశాఖ జిల్లా మహాసభ

▶ వార్త 8లో..

మాట్లాడుతున్న రామచందర్, చిత్రంలో అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్‌పి తుహిన్ సిన్హా

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ ఫిర్యాదులపై

తక్షణం స్పందించండి

జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్

ప్రజాశక్తి - అనకాపల్లి : నిమ్న వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా అధికారులు అడుగులు వేయాలని, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ అన్నారు. జాతీయ ఎస్‌సి కమిషన్ షెడ్యూల్డు కులాల సాంఘిక, ఆర్థిక అభివృద్ధిలో విశేష కృషి చేస్తోందని తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, మిగతా 2లో..

జివిఎంసికి జాతీయ స్థాయి స్వచ్ఛ పురస్కారం

◆ సఫాయి మిత్ర సురక్షిత్ షెహర్ ప్రత్యేక కేటగిరీలో ప్రథమ స్థానం

◆ మేయర్, కమిషనర్‌కు ఢిల్లీలో కేంద్ర మంత్రి అవార్డు ప్రదానం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

స్వచ్ఛభారత్ మిషన్ 2.0 కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ - 2024కుగాను జాతీయ స్థాయి స్వచ్ఛ పురస్కారాన్ని జివిఎంసి దక్కించుకుంది. సఫాయి మిత్ర సురక్షిత్ షెహర్ ప్రత్యేక కేటగిరీలో ప్రథమ స్థానం కైవశం చేసుకుంది. ఈ క్రమంలో విశాఖ నగర్ మేయర్ పీలా శ్రీనివాసరావు రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్‌లతో కలిసి గురువారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ - 2024 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సఫాయిమిత్ర సురక్షిత్ షెహర్ ప్రత్యేక కేటగిరీలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి అవార్డు దక్కడం విశాఖ నగరానికి ఎంతో గౌరవమని పేర్కొన్నారు. ఈ పురస్కారం మిక్కిలి సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ ఘనత సఫాయి కార్మికులకు, సహకరించిన ప్రజలకు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లకు, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్లకు, నివాసిత సంక్షేమ సంఘాలకు, స్వచ్ఛంద సంస్థలకు, జివిఎంసి అధికారులకు, ఉద్యోగులకు దక్కుతుందన్నారు. జివిఎంసి కమిషనర్ మిగతా 2లో..

కేంద్ర మంత్రి మనోహర్ లాల్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న జివిఎంసి మేయర్, కమిషనర్

మొదటి పేజీ తరువాయి..

పేదవారా ? కాదా ?

ప్రచారం చేస్తోంది.

విశాఖలో ఆచరణలో జరిగిందేంటి ?

పేదలకు ఆర్థిక మద్దతు ఇవ్వడం, నాణ్యమైన విద్య, వైద్యం అందించడం కోసమంటూ ఇప్పటివరకూ విశాఖ జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 73,949 కుటుంబాలకు సాయం అందించడానికి పారిశ్రామికవేత్తలుగానీ, సంపన్నులైన రాజకీయ కుటుంబాలుగానీ ఎవ్వరూ ముందుకు రాలేదని సంబంధిత అధికారులు 'ప్రజాశక్తి'కి గురువారం తెలిపారు. ఇంతవరకూ పేదలను గుర్తించామని, ఈ నెల 17 నుంచీ రీ వేలిడేషన్ హౌస్ హోల్డ్ సర్వే ద్వారా పేదలా ? కాదా ? అన్నది నిర్ధారిస్తామని చెబుతున్నారు. పేద కుటుంబాల విషయమై పంచాయతీ తీర్మానం చేశాక, సచివాలయం ఆ డేటాను ఎక్కడికక్కడ అప్‌లోడ్ చేశాక మరలా సంపన్నుల సాయం కోసం ప్రయత్నాలు చేస్తామని చీఫ్ ప్లానింగ్ అధికారి వెల్లడించారు. బంగారు కుటుంబాలకు పథకాలన్నీ వర్తించేలాగ ప్రభుత్వం విధానం తీసుకుందని తెలిపారు.

జివిఎంసికి జాతీయ స్థాయి స్వచ్ఛ పురస్కారం

కేతన్ గార్గ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లోనూ విశాఖ నగరం ఉత్తమ పరిశుభ్ర నగర ఖ్యాతిని దక్కించుకునేలా కృషి చేయాలని ఆయనకు సూచించారు. జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ పరిశుభ్ర నగరాల్లో విశాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని మరోసారి రూఢీ అయిందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీర్ పల్లమరాజు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ ఫిర్యాదులపై తక్షణం స్పందించండి

ఎస్‌పి తుహిన్ సిన్హాలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎస్‌సి తరగతిలో అక్షరాస్యత, వివిధ పథకాల అమలు, ఆరోగ్యం, పోషణ, భూ పంపిణీ, నవోదయం తదితర అంశాలను కలెక్టర్ విజయ కృష్ణన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆయా శాఖల పరిధిలో అమలు చేస్తున్న కార్యక్రమాల ప్రగతిని తెలియజేశారు. అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులు, వాటిలో పురోగతి, గ్రామాల్లో సైతం సీసీ కెమెరాల ద్వారా నిఘా వంటి విషయాలను జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా వివరించారు. ఈ సందర్భంగా రామచందర్ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా వారికి అందేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ చట్టం ద్వారా అర్హులందరికీ జాబ్ కార్డులు ఇచ్చి పనిదినాలు కల్పించాలని అన్నారు. పరిశ్రమలు స్థాపించుకునేందుకు శాఖాపరంగా సహకారం అందించాలన్నారు. సమావేశంలో జాతీయ ఎస్‌సి కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సుబ్బలక్ష్మి, అనకాపల్లి ఆర్‌డిఒ షేక్ అయిషా, షెడ్యూల్డు కులాల సంక్షేమ ఉప సంచాలకులు బి.రామానందం, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో రక్త కొరత తీవ్రంగా ఉందని, ఈ నేపథ్యంలో యువత పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ థియేటర్‌లో నెరెడ్కో, విఎంఆర్‌డిఎ సంయుక్తంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నరెడ్కో రాష్ట్ర అధ్యక్షులు గద్దె చక్రధర్‌తో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వ్యాధులు వ్యాపిస్తున్న ప్రస్తుత తరుణంలో రక్తదాన కేంద్రాల్లో ఏర్పడిన కొరతను తీర్చేందుకు నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్, విఎంఆర్‌డిఎ సంయుక్తంగా ఎన్‌టిఆర్ బ్లడ్ బ్యాంక్, రోటరీ, రెడ్ క్రాస్, అపోలో వారి సహకారంతో మెగా వైద్య, రక్తదాన శిబిరాన్ని చేపట్టాయన్నారు. కార్యక్రమంలో నరెడ్కో జోన్ ప్రెసిడెంట్ ఎ.రమేష్ బాబు, జనరల్ సెక్రెటరీ దండమూడి పాపారావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.ఎ.హుస్సేన్, వైవి.చౌదరి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో పేద, బలహీనవర్గాల కోసం నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాల ప్రగతిని వేగవంతం చెయ్యాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ .హరేందిర ప్రసాద్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు గురువారం ఆయన రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చేపడుతున్న పేదల గృహాల స్టేజ్ కన్వర్షన్, మౌలిక సదుపాయాల కల్పన, గృహ నిర్మాణాల ప్రగతిపై కలెక్టరేట్ మీటింగ్ హాలులో హౌసింగ్, గ్రామీణ నీటి సరఫరా జివిఎంసి, విద్యుత్, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు.

మద్దిలపేటలో పొలం బడి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని మద్దిలపేటలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన గురువారం ఉత్తమ యాజమాన్య పద్ధతుల్లో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి సాగులో శాస్త్రీయ పద్ధతులు, ఎరువులు, పురుగు మందుల వినియోగం, విత్తనం నుంచి విక్రయం వరకు పాటించాల్సిన అంశాలపై మండల వ్యవసాయ శాఖాధికారి బి.శివకోమలి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణాధికారి స్వాతి విత్తన శుద్ధి ప్రాధాన్యతను వివరించారు.

3 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి -ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి శివాజీనగర్‌లో ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా గురువారం సుమారు 3000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదానాన్ని వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, ఆలయ గౌరవాధ్యక్షులు పిల్లి వీర్రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, మధు, అమృతరావు, సత్యనారాయణ, గణేష్, అశోక్, శివాజీ పాల్గొన్నారు.

మధ్య తరగతికి ఇబ్బంది లేకుండా మాస్టర్ ప్లాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మధ్య తరగతి వర్గాలకు ఇబ్బందులు లేకుండా మాస్టర్ ప్లాన్‌పై శ్వేత పత్రం విడుదల చేస్తామని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ అన్నారు. విఎంఆర్‌డిఎ రూపొందించిన మాస్టర్ ప్లాన్ - 2041పై సలహాలు, సూచనల స్వీకరణ కార్యక్రమానికి రెండో రోజైన గురువారమూ విశేష స్పందన లభించింది. పెద్ద ఎత్తున నగర వాసులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని మాస్టర్ ప్లాన్‌పై పలు సూచనలు చేసి, వినతులు సమర్పించారు. సంస్థ కార్యాలయంలోని మూడో అంతస్తు సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్, కమిషనర్ కెఎస్ విశ్వనాథన్ స్వయంగా పాల్గొని మాస్టర్ ప్లాన్‌పై సలహాలు, సూచనలను స్వీకరించారు. ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్‌లతో పాటు పలువురు నగర ప్రజలు, తమ పరిధిలోని మాస్టర్ ప్లాన్ పై పలు సూచనలు, సలహాలు సమర్పించారు. రెండు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో మొత్తం 70 వరకు వినతులు వచ్చాయి.

వినతిపత్రం అందజేస్తున్న విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

టిడ్కో గృహాలన్నింటికీ మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డిసెంబర్‌కు టిడ్కో గృహాలన్నింటిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ తెలిపారు. గురువారం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి ఆయన 39వ వార్డు సీహార్స్ జంక్షన్, చిలకపేటలో ఉన్న టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించారు. అక్కడి నివాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటర్ లీకేజీ సమస్య ఉన్నట్టు అక్కడి వారు తెలిపారు. దీంతో ఇళ్లు దెబ్బతింటున్నాయని, చుట్టుపక్కల ప్రాంతాలు శుభ్రత లోపిస్తున్నాయని ఫిర్యాదు చేశారు. దీనికి ఆయన స్పందిస్తూ టాటా ప్రాజెక్టుకు ఇప్పటికే వాటర్ లీకేజీ సమస్య గురించి చెప్పామని, వచ్చే నెల 31వ తేదీలోగా టిడ్కో గృహాల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించామని అన్నారు. గత ప్రభుత్వం టిడ్కో గృహాల పట్ల నిర్లక్ష్యం వహించిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహమ్మద్ సాధిక్, కందుల నాగరాజు, విల్లూరి భాస్కరరావు, భీశెట్టి వసంత లక్ష్మి, జోన్ 4 కమిషనర్ మల్లయ్య నాయుడు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులతో అజయ్‌కుమార్

హెచ్‌పివి వ్యాక్సిన్‌తో మహిళల్లో కేన్సర్ నియంత్రణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహిళల్లో గర్భాశయ ముఖద్వార కేన్సర్ నియంత్రణకుగాను 9 నుండి 14 ఏళ్ల బాలలకు హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పివి) వ్యాక్సిన్‌ను తల్లిదండ్రులు విధిగా వేయించాలని దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. విశాఖపట్నం పోర్టు ట్రస్టు సమకూరుస్తున్న సిఎస్ఆర్ నిధులతో క్వీన్ మెరీ పాఠశాలలో చదువుతున్న 9 నుండి 14 ఏళ్ల బాలికలకు లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థలు సంయుక్తంగా ఈ వ్యాక్సిన్‌ను సీతమ్మధారలోని లయన్స్ కేన్సర్ ఆస్పత్రిలో ఆగస్టు నెలలో వేయనున్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంపొందించేందుకు గురువారం ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాలలో అవగాహనా శిబిరం ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, రిటైర్డ్ డిఎంఅండ్ హెచ్‌ఒ డాక్టర్ సరోజిని పాల్గొన్నారు.

సంపూర్ణ వ్యక్తిత్వ వికాసమే విద్య లక్ష్యం

ప్రజాశక్తి- ములగాడ : సంపూర్ణ వ్యక్తిత్వ వికాసమే విద్య లక్ష్యమని, అందుకుగాను విద్యార్థులు అన్ని రంగాల్లోనూ ప్రతిభను నిరూపించుకోవాలని సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో గత మూడు రోజులుగా నూతనంగా డిగ్రీలో ప్రవేశించిన విద్యార్థినులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాల ముగింపు సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

IN THE HON'BLE COURT OF THE VI ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
E.P.37/2023 in O.S.237/2016

Between:
Galla Venkata Ramana ...D.Hr/Plaintiff
And:
Gandham Prasanna Murthy .... J.Dr/Defendant

Notice under Order-21 Rule-34 of CPC

To,
J.Dr: Gandham Prasanna Murthy,
S/o late Ranganadha Rao,
R/at D.No.21-27-9, Ganneru Street,
Town Kotha Road, Visakhapatnam.

Please take notice that the above EP filed by the D.Hr under Order XXI Rule 34 of C.P.C for execution of sale deed in favour of D.Hr as per the decree in the above suit dated 31-10-2019 in respect of the schedule property belongs to you therein. The Hon'ble Court was pleased to order notice to you under Order 21 rule 34 of CPC through this publication. Hence, you are hereby required to appear in the above Court in person or through a pleader duly instructed on **04-08-2025 at 10:30 A.M.** If you fail to appear before the Hon'ble Court on that day, the matter will be heard in your absence and necessary orders will be passed.

(By Order of the Hon'ble Court)
M.V.S. NARAYANA,
Advocate
Visakhapatnam.

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. 34/2022 IN O.S. 345/2017

పెరిశెట్టి మల్లేశ్వరరావు... DHR/వాది
Vs
మరిసా చిలుకు నాయుడు
..... JDR / ప్రతివాది

పై నెంబరు అమలులో DHRకు JDR ప్రతివాది నుండి వసూలు కావలసిన డిక్రి బాకీ రాబట్టే నిమిత్తం JDR యొక్క ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని పై కోర్టు వారు **తే 5-8-2025దిని ఉదయం 10:30 నిమిషముల** నుండి వేలం వేయుదురు. కావున వేలం పాటలో పాల్గొదలచినవారు పై కోర్టులో హాజరై, కోర్టు వారి షరతులకు లోబడి వేలం పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూల్ ఆస్తి వివరాలు

R.C.C.slabbed house with vacant space of 22 feet on back side of the Said house bearing Suryey.NO 357/2, D.No.8-40 situated at northern side of Main street in Ravada Village, Parawada Mandal, Lankelapalem Sub-Registar Office Anakapalli District-whith dimensions and boundaries are as Follows:-
North:-House of Ganapathi Lakshmi and K.Lakshamana.
East:- C.C.Road.
South:-C.C.Road.
West:- House of Marisi Appalaraju.
H/o SeataramaTulasi.
Dimensions: Length 52 Feet out of which house portion is 30 Feet and vacant space of 22 Feet on back side Width:-12 Feet.
DHR Value:-RS 8,00,000/-
Amin Value:-RS 15,00,000/-
Market Value:-RS 14,62,600/-
JDR Value:- Nil

M.NAGESWARAO
ADVOCATE, VISAKHAPATNAAM
CELL:-7032322122

మహారాజశ్రీ విశాఖపట్నం 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
G.O.P. No. 8 / 2025

బిట్వీన్:
1. రేఖా మీనా
2. రేఖా అప్పలరాజు . . . పిటిషనర్లు
అండ్:
నిల్ ..... రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

ఇందుమూలంగా యావన్మందికి తెలియ జేయునది ఏమనగా మైనర్లు అయిన (1) రేఖా యశ్వంత్ (13 సం॥లు) (2) రేఖా హిమశ్రీ (11 సం॥లు) (3) రేఖా చందనశ్రీ (9 సం॥లు) లకు గార్డియనుగా నియమించమని 1వ పిటిషనరు 2వ పిటిషనరుతో కలిసి పై నెంబరు పిటిషనును దాఖలు చేసియున్నారు. పై పిటిషను తే:18-08-2025దికు వాయిదా వేసియున్నారు.

కావున, సదరు మైనర్లుకు 1వ పిటిషనరును గార్డియనుగా నియమించే విషయంలో ఎవ్వరికైననూ ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల పైకోర్టు వారి ఎదుట **తే:18-08-2025ది ఉదయం 10-30 గం॥లకు** స్వయముగా కాని, వకీలు ద్వారా కాని హాజరై తమ ఆక్షేపణలు తెలియపర్చవలెను. లేని యెడల పై పిటిషనును వారి పరోక్షమున విచారణ జరుపబడునని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

విశాఖపట్నం
తే:17-7-2025
K.P. కుమార్ (నాయుడు)
అడ్వకేట్, విశాఖపట్నం

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు, గాజువాకలో
E.P.No. 120 / 2018 O.S.No. 33 / 2009

బిట్వీన్:
మల్లా ప్రతాప్ .... D.Hr
అండ్:
1. నిడదవోలు శ్రీనివాసరాజు .... JDr
2. A.P.Housing Board, Rep. by the Executive Engineer . . . Respondent

To
JDR No.1: నిడదవోలు శ్రీనివాసరాజు
తండ్రి అప్పలరాజు, Flat No. LIG-41,
AP Housing Board Colony,
పెదగంట్యాడ, విశాఖపట్నం-44.

యిందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా మీకు పైకేసులో ఒకటవ ప్రతివాది (1st JDR) అయిన మీ హాజరు నిమిత్తం తేది: 29-07-2025కి వాయిదా వేసియున్నారు. మీకు గల LIG-41, ప్లాట్ నిమిత్తం, పైన తెలిపిన మీ అడ్రస్‌కు మీ హాజరు నిమిత్తం పై ప్లాట్‌కు సంబంధించిన డ్రాఫ్ట్‌సేల్ డీఫ్ (Draft Sale deed) పై మీ వివరణకై, మీ హాజరు నిమిత్తం పై ప్లాట్‌ను DHRకు రిజిస్ట్రేషన్ చేసి నిమిత్తం మీకు నోటీసు పంపినా, మీరు దానికి స్పందించి నోటీసు తీసుకోకపోవడం మూలంగా, ఈ ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం **తేది:29-07-2025దిన ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీకు గాని, మీ ప్లీడర్ ద్వారా గాని హాజరై మీ వాదన చేసుకోవలెను. లేనిచో పై కేసులో మీకు వాదన లేదని భావించి మీ పరోక్షంగా తీర్మానించబడును.

(By Order)
D.V.RAMA RAO Advocate,
Gajuwaka. Cell : 9849595933

గీతంలో నూతన విద్యార్థుల సందడి

ప్రజాశక్తి -మధురవాడ : గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న వివిధ కోర్సులలో ప్రవేశం పొందిన విద్యార్థులకు గురువారం సర్టిఫికేట్ల పరిశీలన, అవగాహన తరగతులను నిర్వహించారు. గీతంలో ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, లా, ఆర్కిటెక్చర్, మెడికల్, పారామెడికల్, ఫార్మసీ, నర్సింగ్, ఫిజియోథెరపి వంటి వృత్తి విద్యాకోర్సులతో పాటు బిఎస్‌సి, బిఎ, బికామ్ వంటి డిగ్రీ కోర్సులలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఈ అవగాహన తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి హాజరైన విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ, నూతన విద్యా విధానానికి అనుగుణంగా గీతం కోర్సులను రూపకల్పన చేయడంతో పాటు నిపుణులైన బోధనా సిబ్బందిని నియమించామని తెలిపారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడానికి ఏటా స్కాలర్‌షిప్‌ల రూపంలో అందజేస్తున్నామన్నారు. విద్యార్థులలో స్టార్టప్ సంస్కృతిని పెంచడానికి వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసామన్నారు. గీతం ఎక్స్‌టర్నల్ రిలేషన్స్ డిప్యూటీ డైరెక్టర్ నవీన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లక్ష మంది పైగా గీతం పూర్వ విద్యార్థులు కీలక పదవులలో ఉన్నారని, ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకం చేయడానికి వారి సహకారం తీసుకుంటున్నామన్నారు. గీతం అడ్మిషన్ల విభాగం అధికారులు, సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు. గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఇంటర్మీడియట్ తత్సమాన కోర్సులు పూర్తి చేసిన వారికి బిఎస్‌సి బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, స్టాటిస్టిక్స్, బిసిఎ, ఫిజియోథెరపి, బిఫార్మసీతో పాటు బిఎ ఎల్ఎల్‌బి, బిబిఎ, బిఎలో ఎకనామిక్స్, హిస్టరీ, ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ కోర్సులు మేజర్, మైనర్ సబ్జెక్టుల ఎంపిక, గీతంలోని వివిధ సదుపాయాలను ఆయా విభాగాధిపతులు, సీనియర్ ప్రొఫెసర్లు వివరించారు.

గీతంలో అడ్మిషన్లు పొందుతున్న నూతన విద్యార్థులు

నేరాలు ఘోరాలు

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధి బక్కన్నపాలెంలో ఈ నెల 11వ తేదీన తాపీ పనిచేస్తూ పిట్స్ వచ్చి పడిపోయిన మల్లెపు రమణ అలియాస్ నాగరాజు (45) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు సిఐ బాలకృష్ణ తెలిపారు. మృతుని పేరు తప్ప ఎటువంటి వివరాలు తెలియలేదని, సంబంధిత బంధువులు ఉంటే పి.ఎం.పాలెం సిఐ 9440796060 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కారు దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో తాళం వేసి ఉన్న ఇళ్లలోకి చొరబడి వాహనాలు దొంగతనం చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు విశాఖ క్రైమ్ ఎసిపి లక్ష్మణరావు తెలిపారు. గురువారం సాయంత్రం ఎంవిపి క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఆ కేసు వివరాలు వెల్లడించారు. లాసన్స్ బే కాలనీ ప్రాంతానికి చెందిన తిరుమల రాజు ఈ నెల 16న ఇంటి ముందు ఉంచిన హ్యుందాయ్ ఐ 20 వాహనం చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సిసి పుటేజీల ఆధారంగా ఆ కారును పాత నేరస్థుడు వాసుపల్లి ఎల్లాజీ (43) దొంగిలించాడని గుర్తించారు. వెంటనే అరెస్టు చేసి కారును, భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన హీరో హోండా బైకును స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన క్రైమ్ ఎసిఐ టి.రవికుమార్, ఎస్ఐ డి.కిషోర్ బాబు, కానిస్టేబుళ్లు ఎస్.హరిప్రసాద్, జగత్ కిరణ్, ఎస్.సాయిలను ఎసిపి అభినందించారు.

నిరసన తెలుపుతున్న సాంకేతిక కళాశాల విద్యార్థులు

'సాంకేతిక' విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి-మధురవాడ : కళాశాల సమయాన్ని కుదించాలని కోరుతూ పి.ఎం.పాలెంలోని సాంకేతిక విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో విద్యార్థులు గురువారం నిరసన చేపట్టారు. కాలేజీ సమయాన్ని పొడిగించడం వల్ల తమకు విశ్రాంతి లేదని, సాయంత్రం ఐదు గంటల వరకు కళాశాలలో ఉంచడం వల్ల దూర ప్రాంతం వెళ్లే వారు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. కళాశాల యాజమాన్యం తమ బాధలు అర్థం చేసుకొని సమయాన్ని కుదించాలని కోరారు. ఉదయం కూడా తొందరగా కళాశాలను ప్రారంభించడం వల్ల దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు రాలేకపోవడంతో అబ్‌సెంట్ వేస్తున్నారని, దీనివల్ల అటెండెన్స్ తక్కువ అయ్యేందుకు కారణమవుతున్నారని తెలిపారు. సమాచారం తెలుసుకున్న పిఎం పాలెం పోలీసులు కళాశాల వద్దకు చేరుకొని విద్యార్థులతో, యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి పలు సూచనలు చేశారు.

కూటమి మోసాలను ఎండగడదాం

ప్రజాశక్తి - ఆరిలోవ : కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ మేనిఫెస్టోలో చెప్పిన హామీలను విస్మరించి మోసం చేసిందని, దీనిని ప్రజల్లో ఎండగడదామని వైసిపి తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. జివిఎంసి 13వ వార్డు వైసిపి అధ్యక్షులు సత్యాల వెంకట్ ఆధ్వర్యంలో గురువారం ఆరిలోవ కాలనీ వైసిపి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు మాట్లాడుతూ, ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ఇంటింటికీ తెలియజేయాలనే ఉద్దేశంతో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి తూర్పు మహిళా అధ్యక్షులు కె.శిరీష, మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ అల్లంపల్లి రాజబాబు, నాయకులు గూడపాటి విక్టర్, సత్యాల సాగరిక, వాసు, వానపల్లి ఈశ్వరరావు, దుర్గారావు, బేగం, వనం వరలక్ష్మి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మజ్జివలస అధ్యక్షునిగా కన్నారావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని మజ్జివలస టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షునిగా పి.కన్నారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పార్టీ గ్రామ కమిటీ నాయకులు తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. తన ఎంపికలో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పిఎసిఎస్ ఛైర్మన్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి, పాండ్రంగి కో-ఆపరేటివ్ సహకార సంఘాల ఛైర్మన్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయా సహకార సంఘాల భవనాల్లో ఛైర్మన్లను సన్మానించారు. పాండ్రంగి గ్రామంలో మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజు పాల్గొని ఛైర్మన్ బార్నాల సత్యశ్రీనివాసును సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కె.దామోదరరావు, కె.రమణ, రామరాజు, ఎం.నందీశ్వరరావు, జి.ప్రసాద్, పల్లి మహేష్, మహంతి అప్పలరమణ పాల్గొన్నారు.

అశోక్ గజపతిరాజుకు అభినందనలు

ప్రజాశక్తి -ఆనందపురం : గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజును ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు విజయనగరంలోని అశోక్ బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షులు జంగం జోషి, మమ్ముల తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి గెద్ద చిరంజీవి పాల్గొన్నారు

ఆశా వర్కర్ పోస్టుకు దరఖాస్తు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామ ఆశా వర్కర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లీలా ప్రసాద్ కోరారు. ఈనెల 18వ తేదీలోగా రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన వారై, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఆధార్ కార్డు సంబంధిత వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను జిల్లా స్థాయి అధికారులు పరిశీలించి నియామకం చేస్తారని పేర్కొన్నారు.

ఘనంగా 'కనకమహాలక్ష్మి' పండగ

ప్రజాశక్తి -మాధవధార : మాధవధార చైతన్య గార్డెన్స్‌లో కనకదుర్గాలమ్మ, గాయత్రీదేవి, కనకమహాలక్ష్మి అమ్మవారు పండుగలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త, 51వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సనపల కీర్తి దంపతులు ఆధ్వర్యాన ప్రథమ పూజ నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మంచినీరు, ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఉభయ గోదావరి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్‌గోపాలరావు, సహాయ కన్వీనర్ పప్పల రామచంద్రరావు, పి.వి.రమణ, 50వ వార్డు టిడిపి అధ్యక్షులు సనపల వరప్రసాద్, సనపల బంగారురాజు, దేవాదాయ శాఖ ఛైర్మన్ నంబాల ఉదంతరావు, పూజారి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : గంటా

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చిప్పాడ దివీస్ సంస్థ సిఎస్ఆర్ నిధులు రూ.1.18 కోట్లతో నిర్మించిన జెడ్పి ఉన్నత పాఠశాల ఆరు అదనపు తరగతి గదులను గురువారం దివీస్ జిఎం ఎంఎస్ఎన్.రావుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనుభవజ్ఞులు, నైపుణ్యం గల ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తారని, విశాలమైన ఆట స్థలం, ఆహ్లాదకరమైన వాతావరణం, మౌలిక సదుపాయాల కల్పన కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉంటాయన్నారు. ముందుగా పాఠశాల ముఖ ద్వారాన్ని, తదుపరి ఆరు తరగతి గదులను, కళా వేదికను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవసరమైన కుర్చీలు, టేబుళ్లు, బల్లలను దివీస్ యాజమాన్యం ఇప్పటికే సమకూర్చడం, ఇతరత్రా మౌలిక సదుపాయాలు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం జేయడమే గాకుండా యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు, ఎంపిటిసి సభ్యులు చుక్క ఈశ్వరమ్మ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు సరగడ అప్పారావు, ఎస్ఎంసి ఛైర్మన్ సిహెచ్.శంకరరెడ్డి, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు శ్రీనివాస్, కె.నరసింహ, శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోట, సరోజదేవిలకు ఘన నివాళి

ప్రజాశక్తి-గోపాలపట్నం : ఇటీవల మృతిచెందిన చలనచిత్ర నటులు కోట శ్రీనివాసరావు, బి.సరోజదేవికి గోపాలపట్నం కళాపీఠం ఆధ్వర్యాన కళాపీఠం కార్యాలయంలో ఘననివాళి అర్పించారు. ఇద్దరి చిత్రపటాలకు కళాపీఠం అధ్యక్షులు గొరపల్లి బంగారురాజు, ఉపాధ్యక్షులు బండారు శ్రీనువాసరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు మాట్లాడుతూ, తెలుగు చలనచిత్ర సీమలో కోట శ్రీనువాసరావు వైవిధ్యభరితమైన నటుడన్నారు.బి.సరోజదేవి అత్యంత విజయవంతమైన నటిగా కీర్తి ప్రతిష్టలు ఆర్జించారని పేర్కొన్నారు. రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు దిగ్గజ నటులు కోల్పోవడం కళామతల్లికి తీరనిలోటని పేర్కొన్నారు.

విశాఖ డెయిరీ పాల అమ్మకాల్లో సహకారం

ప్రజాశక్తి -పద్మనాభం : విశాఖ డెయిరీ పాలు అమ్మకాల్లో అందరి సహకారం ఉండాలని విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనందకుమార్ అన్నారు. విజయనగరం ఎంసిసి సమీపంలో ఉన్న కల్యాణమండపంలో ఎంసిసి పరిధిలో ఉన్న పద్మనాభం, జామి, గంట్యాడ, డెంకాడ, భోగాపురం మండలాలకు సంబంధించి పాల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ డెయిరీ రైతుల నుంచి నాణ్యమైన పాలు సేకరించడంలో మంచి ఫలితాలు సాధించామన్నారు. అయితే ప్రస్తుతం పోటీ ప్రపంచంలో సేకరించిన పాలను మార్కెట్లో అమ్ముకోలేకపోతున్నామన్నారు. దీనివల్ల పాలు పౌడర్ చేయడం, దాన్ని నిలవచేయడం, లక్ష లీటర్ల పాలను ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవడంలో నష్టపోతున్నామని వివరించారు. పాల సేకరణ కేంద్రం పరిధిలో విశాఖ డెయిరీ పాలను, పాల పదార్థాలను అమ్మడానికి సంఘం అధ్యక్షులు కార్యదర్శులు సహకరించాలని కోరారు. తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల నుంచి చౌకగా పాలు దిగుబడి కావడంతో మన పాలను ఆ ప్రాంతం వారు కొనుగోలు చేయటం లేదని తెలిపారు. అనంతరం ఆనంద్‌కుమార్‌ను సంఘం అధ్యక్ష కార్యదర్శులందరూ సత్కరించారు. కార్యక్రమానికి ముందుగా తులసీరావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ సిఇఒ కెవివి.ప్రసాద్, డైరెక్టర్లు కాటమయ్య సన్యాసినాయుడు, ఎంసిసి మేనేజర్ వేణుగోపాల్, విశాఖ డెయిరీ పశువైద్య అధికారి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

వైసిపి 13వ వార్డు అధ్యక్షునిగా సత్యాల వెంకట్

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు వైసిపి అధ్యక్షునిగా సత్యాల వెంకట్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి గురువారం పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సత్యాల వెంకట్ మాట్లాడుతూ, పార్టీకి చేసిన కృషిని గుర్తించి తనకు పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి కురసాల కన్నబాబు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి, నాయకులు గొలగాని శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షులు పేడాడ రమణికుమారి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డులో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

భీమిలి రాజీవ్ గృహకల్ప సముదాయంలో పాదయాత్ర

ప్రజాశక్తి-యంత్రాంగం

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన పలు ప్రాంతాల్లో పాదయాత్రలు, కరపత్రాల పంపిణీ కార్యక్రమాలు గురువారం చేపట్టారు.

భీమునిపట్నం : స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన జివిఎంసి నాల్గో వార్డు పరిధి రాజీవ్ గృహకల్ప సముదాయంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, స్థానికులు అన్నాబత్తుల నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

మాధవధారలో కరపత్రాల పంపిణీ...

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 51వ వార్డు పరిధి మాధవధారలో సిపిఎం నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. స్మార్ట్ మీటర్లు వద్దు అంటూ స్టిక్కర్లను ఇంటింటికీ అంటించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సనపల రామగోపాలరావు, కూన సత్యనారాయణ, కె.సుధాకర్, గోపాలకృష్ణ, శ్రావణ్‌కుమార్, నర్సింగరావు, పార్వతి, భవాని తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి సుజాతనగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. అదానీ ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించకుండా ప్రజలు తిరస్కరించాలని సిపిఎం జోన్ నాయకులు కె.అప్పలనాయుడు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈశ్వరరావు, ప్రభుదేవా, మహేష్, ఎస్.రాజు, ఎం.రాజు, అన్నపూర్ణ, లక్ష్మి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో...

గాజువాక : జివిఎంసి 68వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెంలో సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర చేశారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను స్థానిక ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లోకేష్, వనమాల అప్పలరాజు, ఎస్.జగన్నాధరావు, రమణమ్మ, అప్పారావు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో...

పారిశుధ్య కార్మికుల సమస్యలపై 19న ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 19వ తేదీన జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు గొలగాని అప్పారావు తెలిపారు. హరిజన జగ్గయ్యపాలెంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు కావటం లేదని, మిస్సింగ్ జీతాలు రావటం లేదని, ఇపిఎఫ్‌లో నామిని సౌకర్యం కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీ కృషి చేయటం లేదని, క్యాజువల్ లీవులు రికార్డులు చెయ్యటం లేదని, ఇంకా మిగిలి ఉన్న కార్మికుల ఇన్‌కమ్ టాక్స్ అమౌంట్ రాలేదని తెలిపారు. ఈ డిమాండ్లపై ధర్నా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్యవతి, విజయ్, బోలా, లక్ష్మి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -గాజువాక : వచ్చేనెల 1వ తేదీన నిర్వహించనున్న 35వ మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను దళ్లివానిపాలెంలో మహాత్మా మదర్ థెరీసా ట్రస్ట్ అధ్యక్షుడు జాగరపు శ్రీను, వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ఫౌండర్ బ్లడ్ మాన్ వినోద్ బాలు గురువారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు జాగారపు శ్రీను మాట్లాడుతూ, ట్రస్ట్ ద్వారా 34 రక్తదాన శిబిరాలు నిర్వహించి 18 వేల మందికిపైగా రోగులకు రక్తాన్ని వినోద్ బాలు సహకారంతో అందించినట్లు తెలిపారు. గర్భిణిలు, కేన్సర్, డయాలసిస్, తలసేమియా రోగులు రక్తం అందక చాలా ఇబ్బంది పడుతున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని మెగా రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాస ప్రసాద్, పల్లం గిరి, గంధం సాయి, శ్రీరామ్, విషం అజయ్, సుధమల్ల శ్రీను, ప్రవీణ్, రవీంద్ర, మోహన్ పాల్గొన్నారు.

అప్పన్న నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి నిత్య అన్నప్రసాద నిధికి సిరిపురం ప్రాంతంలోని సాయిశిఖరా ఎన్‌క్లేవ్, బాలాజీ నగర్ నివాసితులు కోసూరు వెకేన శ్రీనివాస హరి గోపాల్, హిమబిందు రూ.1 లక్ష విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని దేవస్థాన పిఆర్ఒ కార్యాలయంలో చెల్లించి, అధికారిక రసీదు పొందారు. వీరిని పర్యవేక్షణాధికారి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన పిఆర్ఒ నాయుడు, జూనియర్ సహాయకులు వరాహ నరసింహం దేవస్థానం తరపున విరాళ బాండ్ అందజేశారు. వారిని ఆలయ అధికారులు శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న ఇస్రో చైర్మన్

ప్రజాశక్తి- వేపగుంట : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ గురువారం శ్రీవరాహ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఇస్రో చైర్మన్‌కు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతించారు. అనంతరం ఇస్రో చైర్మన్ కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. దేవస్థానం తరపున డాక్టర్ నారాయణన్‌ను శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి పటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సహాయకులు వరాహనరసింహం తదితరులు పాల్గొన్నారు.

ఇపిడిసిఎల్ జోన్-1 ఇఇగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

జోన్-1 ఇఇగా పోలాకి

ప్రజాశక్తి-సీతమ్మధార : జోన్ -1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పోలాకి శ్రీనివాసరావు గ్రీన్ పార్క్ వద్ద గల ఎస్‌సి కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు విద్యుత్ సమస్యలు లేకుండా అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఓల్డ్ టౌన్, వాల్తేరు, దొండపర్తి, సీతమ్మధార తదితర ప్రాంతాల నుండి అధికారులు విద్యుత్ సంఘాల నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శిరీషా గాయత్రి, జ్యోతి, విద్యాసాగర్, ఎఇలు, జెఇలు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీరియళ్లు, సెల్‌ఫోన్ ప్రభావంతో అత్యాచారాలు

ఐద్వా జిల్లా అధ్యక్షులు పద్మ

సభలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు బి.పద్మ

ప్రజాశక్తి-గోపాలపట్నం : టీవీ సీరియళ్లు, సెల్‌ఫోన్ ప్రభావంతో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ పేర్కొన్నారు. ఐద్వా గోపాలపట్నం జోన్ 8వ సభలను స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ, నిత్యావసర ధరలు పెరగడంతో ఆ భారం మహిళలపై అధికంగా పడుతుందన్నారు. నానాటికి మహిళలపై ఆఘాయిత్యాలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. నారీశక్తి దేశానికి తిరుగులేని ఆయుధ సంపత్తి అని కొనియాడారు. అనంతరం ఐద్వా జోన్ కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వై.సత్యవతి, జోన్ ఉపాధ్యక్షులు వి.ప్రభావతి, నాయకులు బి.రమణి, అనంతలక్ష్మి, డి.లీలావతి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఐద్వా గోపాలపట్నం జోన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.వెంకటలక్ష్మి, కార్యదర్శిగా ఎస్.విజయలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా కె.అనసూయ, ఎన్.వేణు, బి.లీల, ఎం.ముత్యాలమ్మ, పిఎస్.కాంతం, శ్రీదేవి, జి.విజయ, అన్నపూర్ణ తోపాటు మరో 14మంది సభ్యులు ఎన్నికయ్యారు.

'విశాఖ'లో సివిల్ ఇంజినీరింగ్ జియోమెటిక్స్‌పై సెమినార్

ప్రజాశక్తి- వేపగుంట : విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో 'సివిల్ ఇంజినీరింగ్ జియోమెటిక్స్'పాత్ర అనే అంశంపై గురువారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా గాయత్రి విద్యా పరిషత్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ రమేష్ నాయుడు హాజరై సెమినార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జియోమెటిక్స్ అనేది భూమి ఉపరితలం గురించి సమాచారం సేకరణ, విశ్లేషణ ప్రాసెసింగ్‌కు సంబంధించిన విజ్ఞానమని వివరించారు. సివిల్ ఇంజినీరింగ్‌లో జియోమెటిక్స్ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ఇది ప్రాజెక్టు స్థలాన్ని నిర్ణయించడంలో మ్యాపింగ్, డిజైన్, నిర్మాణం, పర్యవేక్షణలో కీలకమైనదని చెప్పారు. చదువులతో పాటు పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధిని ఏ విధంగా పెంపొందించుకోవాలో సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ ప్రదీప్‌వర్మ, డిప్లమో కళాశాల ప్రిన్సిపాల్, పి ప్రసాద్, సివిల్ హెచ్ఒడి డాక్టర్ సిహెచ్ కన్నమనాయుడు, సెమినార్ కన్వీనర్ వై.ప్రియాంక పాల్గొన్నారు.

'ఆదర్శ్'లో క్యాంపస్ టు కార్పొరేట్ అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఐబిఎస్ ఆధ్వర్యాన క్యాంపస్ టు కార్పొరేట్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఇ.ఫ్లోరా తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఐబిఎస్ రీజనల్ మేనేజర్ ఎం.జగదీష్‌కుమార్, గౌరవ అతిథులుగా బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, డిప్యూటీ మేనేజర్ వై.కోటేశ్వరరావు, అతిథులుగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఇ.ఫ్లోరా, వైస్ ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ టి. థియోఫిలస్ మాట్లాడుతూ, ఇలాంటి సదస్సులు విద్యార్థులు తమ భవిష్యత్తు పట్ల మంచి ప్రణాళికలు వేసుకునేందుకు దోహద పడతాయన్నారు. ముఖ్యఅతిథి జగదీష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ భవిష్యత్తును ఎలా ప్రణాళిక చేసుకోవాలి, ఎంప్లాయిమెంట్ స్కిల్స్, ప్రాబ్లం సాల్వింగ్, భవిష్యత్ ఐఐఎం స్కూల్స్‌లో అవకాశాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ్ డిగ్రీ కళాశాల బోధన సిబ్బంది డి.సింహాచలం, డిటి.రమ్య, కమలరాణి, మంజుల, పద్మ, ఎఒ రవిబాబు పాల్గొన్నారు.

శాంతినగర్ పార్కు ప్రారంభం

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డులో శాంతినగర్ పార్కును మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్కులో సుందరీకరణ, మోడల్ లైటింగ్, జిమ్, చిన్నారుల ఆట పరికరాలు, రబ్బర్ ఫ్లోరింగ్ వంటి పనులను సుమారు రూ.45 లక్షలతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జియ్యాని విజయ్‌కుమార్, వెంకటరమణ, సెక్రటరీ శ్రీనివాసరావు, సత్యనారాయణ, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ వ్యాపారులకు లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫుడ్ వ్యాపారస్తులు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ, తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని జివిఎంసి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. కెవిజివిఎం ఆధ్వర్యాన 'ఆహార భద్రత- శిక్షణ కార్యక్రమం' గురువారం పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుర్తింపు ఉన్న మంచి కంపెనీల ఉత్పత్తులను ఆహారం తయారీకి వాడాలని చెప్పారు. కెవిజివిఎం సౌత్ ఇండియా ఇన్‌ఛార్జి మోహన్‌బాబు మాట్లాడుతూ నాణ్యమైన ఆహారం అందించడం, కల్తీని నివారించడమే శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకులు దండి ప్రియాంక, గవర వెంకటరమణ, కండవ గాయత్రి, ట్రైనర్ సురేష్ కుమార్, జగన్ మురారి పాల్గొన్నారు.

విష్ణుకుమార్‌రాజుతో మాధవ్ భేటీ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్.మాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీని బలపరిచే కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఇరువురు నేతలు చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పరశురామరాజు, శ్యామల దీపికా, సునీల్ పాల్గొన్నారు.

170 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పెంటలో గురువారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ బి.పావని ప్రారంభించారు. విజయనగరంలోని శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ ఎ.శ్రీరామ్‌మూర్తి సహకారంతో డాక్టర్ ఎం జోత్స్న 170 మందిని పరీక్షించారు. మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు రాలి అప్పారావు పాల్గొన్నారు.

హైస్కూల్ అభివృద్ధికి సహకారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని తాటితూరు జెడిపి హైస్కూల్ అభివృద్ధికి నాన్ని హి కలి 3.0 ప్రాజెక్ట్ అనే ఎన్‌జిఒ సంస్థ ముందుకొచ్చిందని హెచ్ఎం డి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రాజెక్ట్ ఎస్ఎ టి.రేణుక మాట్లాడుతూ, విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తామన్నారు.

త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలి

జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

కౌలు రైతులకు, పరిశ్రమలకు, వ్యవసాయ, డెయిరీ, పౌల్ట్రీ ఉపాధి రంగాలకు, స్వయం సహాయక బృందాలకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని, యువతకు స్వయం ఉపాధి పథకాలు మంజూరుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని బ్యాంకు అధికారులను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సంప్రదింపుల కమిటీ, బ్యాంకు రుణాలపై జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డిఎల్ఆర్‌సి) 4వ త్రైమాసిక సమావేశం జిల్లా కలెక్టరు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకులు లక్ష్యాలకు మించి రుణాలు మంజూరు చెయ్యాలన్నారు. వచ్చే సంవత్సరానికి 17 శాతం వృద్ధి రావాలని, అందుకు అనుగుణంగా యూనిట్లు ఏర్పాట్లు చేయాలని కోరారు. తోటలు, కూరగాయలు, పశు సంవర్ధక, డెయిరీ, మత్స్య పరిశ్రమలలో కాలానుగుణంగా ఉత్పత్తి సాధించే రంగాలకు ఆర్థిక చేయూత ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు కూడా వ్యవసాయ రుణాలు అందించాలన్నారు. జిల్లాలో ఉత్పత్తవుతున్న వస్తువులకు బ్రాండింగు, మార్కెటింగు సౌకర్యం కల్పించాలని సూచించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.సత్యనారాయణ గత సమావేశంలో చర్చించిన విషయాలపై తీసుకున్న చర్యలను, రుణ ప్రణాళిక అమలు నివేదికను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ జితేంద్ర కుమార్, ఆర్‌బిఐ ఎల్‌డిఒ రాజేష్ కుమార్ కుంద్, నాబార్డ్ డీడీఎం సమంత్ కుమార్, డైరెక్టర్ ఎస్బిఐ బి.విజయకుమార్, డిఆర్‌డిఎ, మెప్మా పథక సంచాలకులు కె.శచీదేవి, సరోజినీ, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.రామమోహనరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎం.ఎ.రహీమ్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.


అశోక్ గజపతిరాజుతో గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర

గోవా గవర్నర్‌ను కలిసిన సురేంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును విజయనగరం పట్టణంలోని ఆయన బంగ్లాలో ఏపి గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూకంబిక అమ్మవారి చిత్రపటాన్ని ఆయన అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పోలిమేర ఆనంద్ కుమార్, కర్రి సుబ్రహ్మణ్యం, ఎస్.భానుచందర్, జొన్నాడ సురేష్, గురుమూర్తి, కర్రి మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

శ్రామిక హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అసకపల్లి పంచాయితీలో ఉపాధి కూలీలకు శ్రామిక హక్కులపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పి.పద్మజ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా సోషల్ ఆడిట్ ఐకపి టీం ద్వారా ఉపాధి శ్రామికులకు ఉన్న హక్కులు, రోజువారి కనిష్ట వేతనం 307 లబ్ధిచేకురే విధంగా అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి నర్సింగరావు,ఉప సర్పంచ్ కరణం సురేష్, ఎంపీటీసీ కర్రి అప్పారావు, ఈఒఆర్డీ చైతన్య, సెక్రటరీ లావణ్య, వీఆర్వో ఈశ్వరరావు, ఏపీఓ టి.వసంత కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి శ్రీను జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక రాధాకృష్ణ కళ్యాణ మండపంలో టిడిపి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి శ్రీనుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, సుందరపు వెంకట సతీష్ కుమార్, విజయ్, మళ్ల సురేంద్ర, బుద్ద నాగ జగదీష్, కొప్పిశెట్టి వెంకటేష్, పెతకం శెట్టి మౌర్య సింహా, రాజాన రమేష్ కుమార్, దాడి ముసిలి నాయుడు, బెక్కలి పరశురాం, బొడ్డేడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

లంకెలపాలెం జంక్షన్‌లో భద్రతా చర్యలు

లంకెలపాలెం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్లు

ప్రజాశక్తి-పరవాడ : లంకెలపాలెం జంక్షన్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో, ట్రాఫిక్ భద్రత పెంచే దిశగా పరవాడ పోలీసులు పలు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ పర్యవేక్షణలో, పరవాడ పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. ప్రాథమికంగా గాజువాక వైపు నుంచి వచ్చే వాహనాలు జంక్షన్‌కు వేగంగా చేరుతున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలను నివారించేందుకు ముందస్తు చర్యలు ప్రారంభించారు. జంక్షన్‌కు 400 మీటర్ల ముందే రెండు వైపులా క్రిస్‌క్రాస్ డ్రమ్ములు, స్టాపర్లు ఏర్పాటు చేసి, వాటిపై రేడియం స్టిక్కర్లు, ప్రతిఫలించే బోర్డులు అమర్చారు. జూలై 16న ఎల్లో బ్లింకర్ లైట్లను ఏర్పాటు చేశారు. ఇది రాత్రి వేళ వాహనదారులకు ముందస్తు హెచ్చరికలుగా పని చేస్తోంది. త్వరలోనే జంక్షన్ వద్ద రాంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయనున్నారు. ప్రతి రోజు డే, నైట్ షిఫ్టుల్లో పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ మానిటరింగ్ చేస్తున్నారు. వేగ నియంత్రణ, అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక గమనిక కొనసాగిస్తున్నారు. వాహనదారులకు హెచ్చరికగా కనిపించే విధంగా కానిస్టేబుల్ బొమ్మ (కాషన్ బోర్డు) ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. జనభద్రతే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నామని, ప్రజలు కూడా వాహనాల వేగాన్ని నియంత్రిస్తూ సహకరించాలని పరవాడ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

డైలీవేజ్ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

జివిఎంసి అనకాపల్లి జోనల్ పరిధిలో 5 డివిజన్లో పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా పనిచేస్తున్న డైలీవేజ్ పారిశుధ్య కార్మికులకు 5 నెలలుగా బకాయి పడ్డ జీతాలు వెంటనే ఇవ్వాలని జివిఎంసి మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు జివిఎంసి జోనల్ కమిషనర్ చక్రవర్తికి యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్, వై.ఏసు, గోవిందు, ఓంశివ సత్యనారాయణ, బి రాము, అజయ్ తదితరులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంటా శ్రీరామ్ మాట్లాడుతూ అనకాపల్లి జివిఎంసి జోన్లో గత 2 సంవత్సరాలుగా డైలీవేజ్ వర్కర్లుగా పారిశుధ్య పనులు చేస్తూ జీవిస్తున్నారని తెలిపారు. 15 మంది పారిశుధ్య కార్మికులకు 5 నెల జీతాలు చెల్లించకపోవడంతో వస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మున్సిపల్ కమిషనర్ స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నేతలు

పోలీసు స్టేషన్లకు సాంకేతిక పరికరాలు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో ఐసిజెఎస్ 2.0 ప్రాజెక్ట్ అమలు చేయడానికి అవసరమైన సాంకేతిక పరికరాలను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం ఎస్పీ కార్యాలయంలో అందజేశారు. ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, టెక్నికల్ సర్వీసెస్, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన 136 ఆల్ ఇన్ వన్ డెస్క్‌టాప్‌లు, 34 వెబ్ కెమెరాలు, 39 ఎంఎఫ్ ప్రింటర్లు జిల్లాలోని 34 పోలీస్ స్టేషన్లకు పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇంటర్-ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ 2.0 అనేది క్రిమినల్ జస్టిస్ సిస్టమ్‌లోని వివిధ భాగాలను (పోలీస్, కోర్టులు, జైళ్లు, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్స్, ప్రాసిక్యూషన్) సమన్వయం చేసి, డేటా, సమాచారాన్ని సులభంగా పంచుకునే విధంగా రూపొందించిన ఒక ప్రాజెక్టు అని తెలిపారు. సాంకేతిక పరికరాల ద్వారా కేసుల దర్యాప్తు వేగవంతం అవుతూ, విధుల నిర్వహణలో నాణ్యత పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఇన్స్పెక్టర్లు వెంకట నారాయణ, విజయ్ కుమార్, అశోక్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రతిభ కనబరిచిన పోలీసులకు ఎస్‌పి ప్రశంసలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో రిపోర్ట్ అయిన గంజాయి కేసులు, తీవ్రమైన కేసుల్లో నాన్ బైలబుల్ వారెంట్లను సమర్థవంతంగా అమలు చేసి ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రశంసించారు. ఎస్పీ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రత్యేక సమావేశంలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేకంగా బ్రీఫింగ్ నిర్వహించి, సిబ్బంది ఎదుర్కొన్న ఇబ్బందులు, ఇతర రాష్ట్ర పోలీసుల సహకారం తదితర అంశాలపై చర్చించారు. నాన్ బైలబుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేయడం వల్ల చట్టపరమైన చర్యలు వేగవంతం కావడం, నిందితులను కోర్టు ముందు హాజరు పరచడం ద్వారా బాధితులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అత్యంత వ్యయ ప్రయాసలతో ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, వరంగల్, కడప, ఈస్ట్ గోదావరి, విజయనగరం, విశాఖపట్నం సిటీ తదితర ప్రాంతాలకు వెళ్లి నాన్ బైలబుల్ వారెంట్లను విజయవంతంగా అమలు చేసిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ ఎస్.లక్ష్మణమూర్తి, సిసిఎస్ ఎస్సై పి.రమేష్, ఎలమంచిలి ట్రాఫిక్ ఎస్సై బి.రామకృష్ణ, రాంబిల్లి ఎస్సై డి.నాగేంద్ర పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాన్ని ప్రజలకు వివరిస్తాం

ప్రజాశక్తి-అనకాపల్లి : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా వారిచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, చంద్రబాబు మోసాన్ని ప్రజలకు వివరిస్తామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అన్నారు. మండలంలోని తుమ్మపాల బంగారు రాజు కళ్యాణ మండపంలో గురువారం వైసిపి మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద అధ్యక్షతన జరిగిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 2024 ఎన్నికల్లో కూటమి నేతలు ప్రజలను బాండు పేపర్ల ద్వారా మభ్యపెట్టి, సూపర్ సిక్స్ అమలు చేస్తామని నమ్మించి మోసం చేసి గెలిచారని తెలిపారు. కాని నేటికీ ఆ హామీలు నెరవేరలేదన్నారు. బూటకపు వాగ్దానాలు, ఈవీఎం ట్యాంపరింగ్ వంటి మోసాలతో అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ నాయకులు మలసాల కుమార్ రాజా, జాజుల రమేష్, విల్లూరి సూర్య కుమారి చంద్ర శేఖర్, అయిత రాము, తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, ఎంపీటీసీ సభ్యులు పంచదార్ల కన్నారావు పలువురు నాయకులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : చంద్రబాబు ఎప్పుడూ ప్రజలకు మోసపూరిత హామీలు ఇస్తారు తప్ప ఇచ్చిన హామీలను నెరవేర్చిన దాఖలు లేవని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు మండలంలోని తారువ గ్రామంలో గురువారం వైసిపి మండల విస్తృతస్థాయి సమావేశం మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో జెడ్పిటిసి కర్రి సత్యం, నాయకులు పంచాద సింహాచలం నాయుడు, వరదపు రెడ్డి లలిత నాయుడు, కోటాన వెంకటరమణ, వేదలపు శ్రీవాణి, దాసరి సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు జీవీఎంసీ పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదరు కాంట్రాక్టర్‌కు నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించలేదని, దీంతో నాణ్యతలేని భోజనం విద్యార్థులకు పెడుతున్నట్లు గుర్తించామని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి నాణ్యమైన భోజనం పెట్టాలే చూడాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డేడ అప్పారావు, చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, కొల్లి చిన్నఅప్పారావు, బొడ్డు సోమరాజు, బొబ్బిలి గోవిందరాజులు, ముగడా అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, దాడి నూక అప్పారావు పాల్గొన్నారు.

డైలేరియా టీకా వేయడాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రామ్మోహన్‌రావు

పశువులకు ఉచిత టీకాలు

ప్రజాశక్తి-కశింకోట : సంకరజాతి పశువులకు ఉచితంగా థైలేరియా వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని అనకాపల్లి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహన్ రావు అన్నారు. కసింకోట గ్రామంలో పశువులకు టీకాల వేసే కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలు వయసు దాటిన సంకరజాతి పశువులన్నింటికీ ఈ టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కసింకోట పశు వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.చైతన్యమణి, పశుసంవర్ధక సహాయకుడు బి.ఈశ్వరరావు, గోపాలమిత్ర మల్లేష్, రైతులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-పరవాడ : మహిళల భద్రతపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరవాడ పోలీసులు బుధవారం ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహించారు. మహిళా ఉపసంఘ్యా పోలీసు అధికారి ఎస్ఐ జిఎస్‌వి.మహాలక్ష్మి విద్యార్థులకు అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు ఎలా కాల్ చేయాలి, శక్తి యాప్ వినియోగం ఎలా ఉండాలో వివరించారు. కాలేజీ, బస్టాండ్ వంటి ప్రాంతాల్లో ఎదురయ్యే ఈవ్‌టీజింగ్ పరిస్థితులపై స్పందించడంలో జాగ్రత్తలు, బ్లాక్‌మెయిల్ మరియు సోషల్ మీడియా మోసాల నుంచి ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలో సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

దైట్‌లో జనరేటివ్ ఎఐ ఇంటర్న్‌షిప్ విజయవంతం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దైట్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఇ విభాగం ఆధ్వర్యంలో డాటాప్రో కంప్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో భాగస్వామ్యంలో నిర్వహించిన 45 రోజుల జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (జనరేటివ్ ఏఐ) ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ విజయవంతంగా ముగిసింది. విద్యార్థులు ప్రాంప్ట్ ఇంజినీరింగ్, మోడల్ బిల్డింగ్, కంటెంట్ జనరేషన్, క్యాప్స్టోన్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ వంటి కీలక అంశాల్లో 45 రోజులు శిక్షణ పొందారు. ప్రతి విద్యార్థి తాను నేర్చుకున్న అంశాలను ఆధారంగా చేసుకొని ఒక క్యాప్స్టోన్ ప్రాజెక్ట్ ను విజయవంతంగా రూపొందించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్ఫిట్యూట్ ఛైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈ తరహా ఇంటర్న్‌షిప్‌లు విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని అందిస్తూ, ఉద్యోగ అవకాశాలపై స్పష్టతనిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సీఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ కె.సుజాత, డాటాప్రో సంస్థ ప్రతినిధులు దీపక్ హరినాథ్, బి. శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

శ్మశాన వాటికలో బోరుబావి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పంచాయతీ శివారు ఓమ్మివానిపాలెం గ్రామం స్మశాన వాటికలో ఎంపీపీ నిధులతో బోరుబావి ఏర్పాటు పనులను జనసేన నాయకులు పల్లా రమణ, గ్రామ పెద్దలు గురువారం ప్రారంభించారు. గొల్లివానిపాలెం స్మశాన వాటికలో బోర్ వెల్ నిర్మాణ పనులు ఎంపీటీసీ గొర్లి చైతన్య ప్రారంభించారు. కార్యక్రమాల్లో నాయకులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, రొంగలి దేముడుబాబు, సబ్బవరపు రమణ, సబ్బవరపు నరసింహమూర్తి, సబ్బవరపు గాంధీ, సబ్బవరపు ముత్యాల నాయుడు, కిల్లి సూర్యనారాయణ, కే. మోహన్ పాల్గొన్నారు.

బోరుబావి డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

పిఎసిఎస్‌ల పాలకవర్గాలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి
మండలంలోని ములకలపల్లి, ఎం.అలమండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) నూతన త్రిసభ్య పాలకవర్గ సభ్యులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ములకలపల్లి పీఏసీఎస్ ఛైర్మన్‌గా చామంతుల సన్యాసిరావు (బాలు), డైరెక్టర్లుగా రొంగలి గోవిందరావు, బోకం సోమేశ్వరరావు, ఎం.అలమండ పీఏసీఎస్ ఛైర్మన్‌గా గొర్లి గోవింద, డైరెక్టర్లుగా యాళ్ల అప్పలనాయుడు, బొడ్డు వెంకటరావు బాధ్యతలు స్వీకరించారు. వారిని ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. పిఏసిఎస్‌లను బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పెద్దాడ వెంకటరమణ, దొగ్గ దేముడునాయుడు, పోతల పాత్రునాయుడు, కిలపర్తి భాస్కరరావు, కోమార బాబూరావు, కిల్లి గోవింద, చల్లా నానాజీ, ఇతర నాయకులు పాల్గొన్నారు.


పాలకవర్గ సభ్యులను సత్కరించిన ఎమ్మెల్యే బండారు

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : కశింకోట సబ్ స్టేషన్ 33/11 కెవి మరమ్మతులు, హెచ్‌టి / ఎల్‌టి లైన్ల కింద ఉన్న చెట్టుకొమ్మలు తొలగింపు కారణంగా కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలో గల కొత్తూరు, పిసినికాడ గ్రామాలకు ఈనెల 18న ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గృహ, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తుమ్మపాల వాటర్ వర్క్స్ సబ్ స్టేషన్ 11కేవీ లైన్ మరమ్మతుల కారణంగా తుమ్మపాల, మార్టూరు గ్రామాలలో కూడా ఈనెల 18 ఉదయం 9 గంటలు నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

పరవాడ : 11 కెవి ఆర్ఇసిఎస్ రూరల్ ఫీడర్, దేశపాత్రునిపాలెం ఫీడర్, ఆర్ఇసిఎస్ టౌన్ ఫీడర్ల నిర్వహణ పనులు, చెట్ల తొలగింపు కార్యక్రమాలు కార్యకారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కశింకోట ఏపీఈపీడీసీఎల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా గొర్లెవానిపాలెం, ఈ.బోనంగి, పిఎస్.బోనంగి, కలపాక, జాజులవానిపాలెం,దేశపాత్రునిపాలెం, తిక్కవానిపాలెం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

కె.కోటపాడు : స్థానిక సబ్ స్టేషన్ పరిధి పిండ్రంగి, కలిగట్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతులు, చెట్టు కొమ్మలు తొలగించడం వంటి పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు స్థానిక విద్యుత్ ఎఇ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కారణంగా కొరువాడ, ఆర్‌వై.అగ్రహారం, పిండ్రంగి, గవరపాలెం, కేజే పురం, పోతన వలస, ఉగ్గిన వలస, రొంగలి నాయుడుపాలెం, మేడిచర్ల, పైడం పేట, మురుగు పాలెం, పాచిలవాని పాలెం, బత్తివారి కల్లాలు తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

సబ్బవరం : సబ్బవరం-1 సెక్షన్, 33/11కేవీ సబ్బవరం సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ ఫీడర్స్ కొత్తగా 33కేవీ లైన్‌వర్క్ కారణంగా శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల సబ్బవరం జోడుగుళ్ళ, పెద నాయుడుపాలెం, గొల్లలపాలెం, ఆదిరెడ్డిపాలెం, చిన్నయ్యపాలెం గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మాడుగుల : మండలంలో కొత్తగా ప్రతిపాదించబడిన కింతలి విద్యుత్ సబ్ స్టేషన్ పనులు, చెట్లు తొలగింపు దృష్ట్యా ఈనెల 18న గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కింతలి, కింతలి వల్లపురం, ఆవురువాడ, ఎం.కోడూరు, సాగరం,శంకరం,తాటిపర్తి పంచాయతీలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఇఇ అప్పారావు తెలిపారు.

ఆనందపురం : గిడిజాల 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ నిర్వహణ పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎఇ ఎం.అప్పలనాయుడు తెలిపారు. నీలకుండీలు, మిందివానిపాలెం, గుమ్మడివాని పాలెం, శొంఠ్యాం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి రూరల్ ఫీడర్ లైన్‌పై నిర్వహణ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ జోన్ 3 ఇఇ బి.సింహాచలం నాయుడు తెలిపారు. టి.నగరపాలెం, కనకలపేట, మజ్జివలస, లక్ష్మీపురం, సింగనబంద, విజయరాంపురం, కృష్ణంరాజుపేట, మద్ది పేట, నారాయణరాజు పేట గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు చోడవరంలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-చోడవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా చోడవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈనెల 19 శనివారం 16 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలలో పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, పిజి వరకు చదువుకొని, 18 నుండి 35 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను naipunyam.ap.gov.in వెబ్‌సైట్ నందు నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా ఎక్కువ రెస్యూమేలు, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు జెరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు జాబు మేళా జరుగు ప్రదేశానికి హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9494791935 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ యువకులకు కేంద్ర ప్రభుత్వ ఆర్ఎంపి పథకం ద్వారా ఉచితంగా 20 రోజుల ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ కమ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఈఎస్‌డిపి) శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పికెపి ప్రసాద్ తెలిపారు. శిక్షణలో పాల్గొనదలచిన వారు 18 నుండి 58 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, కుల ధ్రువీకరణ పత్రం తీసుకొని ఈనెల 19న ఉదయం 10 గంటలకు మన్నా స్కూల్ (పాయకరావుపేట), తుఫాను బిల్డింగ్ (రాంబిల్లి), కమ్యూనిటీ సెంటర్ (ఎస్‌సి కాలనీ, అసకపల్లి), సత్యం కంప్యూటర్ సెంటర్ (చోడవరం) వారి పరిధిలో ఉన్న కేంద్రాల్లో హాజరుకావాలని సూచించారు. మొదటి బ్యాచ్ శిక్షణ ఈ నెల 21 నుంచి ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు 9951447776, 6305128811 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక సాయం అందిస్తున్న యాదవ సంఘం నేతలు

రోడ్డు ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ప్రమాదంలో భార్యను కోల్పోయి, తను తీవ్ర గాయాలతో మంచానికే పరిమితమైన బాధితునికి యాదవ సంఘం సభ్యులు రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆర్.శివరాంపురానికి చెందిన దేవర చిలుకూనాయుడు గత నెలలో విశాఖపట్నంలో జరిగిన ప్రమాదంలో భార్యను కోల్పోయి, ఆయన తీవ్ర గాయాలతో మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న భరణికాన సాయినాథరావు ఆధ్వర్యంలో గురువారం రూ.25వేలు సహాయం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దేవర తాతాజీ, సింగంపల్లి రమేష్, గోకివాడ కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు, రామారావు, మరిదిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక కోర్టు సముదాయంలో మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. బుధవారం రాత్రి చోడవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా నిలిచిపోయిన కోర్టు భవన సముదాయాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికే రూ.16 లక్షలతో టాయిలెట్లు, రూ.3 లక్షలతో ఆర్ఓఆర్ ప్లాంట్ పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, న్యాయమూర్తి నరేష్, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకర్, న్యాయమూర్తులు సూర్యకళ, లావణ్య, రామారావు, బార్ అసోసియేషన్ సభ్యులు ఎస్ రాజు, అధ్యక్షుడు కామిరెడ్డి వెంకటరావు, కార్యదర్శి చీపురుపల్లి సూర్యనారాయణ, న్యాయవాదులు కందర్ప రామేశం, మంథా గౌరీశంకర్, పీవీ రమణమూర్తి, లక్ష్మీనారాయణ, కాండ్రేగుల దేవిడ్, గూనూరు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

29న ఖరీఫ్‌కు రైవాడ నీరు విడుదల

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఖరీఫ్ సాగునీటి అవసరాలకు ఈనెల 29న రైవాడ జలాశయ నీటిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా విడుదల చేస్తామని జలాశయ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ పోతల పాత్రు నాయుడు తెలిపారు. ఈ మేరకు జలాశయ అతిథి గృహ ఆవరణలో నీటి సంఘాల సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. వారంతా నీటిని ఈనెల 29న విడుదల చేయాలని అధికారులను కోరారు. ప్రస్తుతం నీటిమట్టం 111.30 మీటర్లు ఉందని, ఖరీఫ్‌కు ఇవ్వడానికి నీరు పుష్కలంగా ఉన్నందున ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటిని విడుదల చేస్తామని డిఈఈ సత్యం నాయుడు తెలిపారు. సమావేశంలో చోడవరం సబ్ డివిజన్ డిఈ వేణుగోపాలరావు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, నీటి సంఘాల సభ్యులు రెడ్డి శ్రీను, కోమార బాబూరావు, అవుగడ్డ కోటిపల్లి నాయుడు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో గురువారం వివిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ వడ్డి సత్యారావు, ఎన్ఆర్ఐ, కేర్ వై.నాయుడు, రాజు ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్ఆర్ఐ హాస్పిటల్ వైద్యులు ఉచితంగా గుండె పరీక్షలు చేశారు. శంకర్ ఫౌండేషన్ వైద్య బృందం ఉచిత కంటి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయించి ఇంటికి క్షేమంగా పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు. సుమారు 200 మంది పేద ప్రజలు వచ్చి ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ వడ్డి సత్యారావు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

ఇంటింటికీ టిడిపి నేతల ప్రచారం

మాడుగులలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- మాడుగుల: ప్రభుత్వ పథకాలను ప్రజలకు పూర్తి స్థాయిలో అందించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఎమ్మెల్యే ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ తెలిపారు. గురువారం వీరనారాయణంలో సుపరిపాలనలో తొలి అడుగు భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ముందుగా వీరనారాయణ పిఎసిఎస్ అధ్యక్షునిగా వరహాల నాయుడుతో పాటు డైరెక్టర్లుగా రాకోటి చిన్నోడు, దాడి కనక అప్పారావు ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మండల అధ్యక్షుడు కార్యదర్శులు అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేవుడు, గ్రామ సర్పంచ్ ఎల్లపు అప్పారావు, సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : పట్టణంలోని 12వ క్లస్టర్ బూత్ కన్వీనర్ బొడ్డేడ మురళి ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణం, జీవీఎంసీ 80వ వార్డు 232 బూత్ కర్రివారి వీధి, పిళ్లావారివీధి, వేపచెట్టు ప్రాంతంలో సువరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కర్రి సన్యాసి అప్పారావు, కర్రి గంగాధర్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట :మండలంలోని ఆర్.శివరాంపురం పంచాయతీలో గురువారం సూపరిపాలన తొలి అడుగు కార్యక్రమంనిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు . ఈ కార్యక్రమం లో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తమరాన ఎంపీటీసీ కంచిపాటి శ్రీను, తామరన దాసు, దేవర తాతాజీ తదితరులు పాల్గొన్నారు

బుచ్చయ్యపేటలో ప్రచారం చేస్తున్న నేతలు

భీమునిపట్నం : మండలంలోని చిప్పాడ పంచాయతీ కొసనవానిపాలెంలో 'సువరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు సరగడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు

ములగాడ : జివిఎంసి 60వ వార్డు పరిధిలో సువరిపానలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంద్రకాలనీ నుంచి అశోక్‌నగర్ వరకు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే గణబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులు

ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రోడ్డు పనులు

ప్రజాశక్తి -గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆర్టీసి నిధులు రూ.6.5 లక్షల ఈ రోడ్డును నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటి వరకు రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో వర్షం పడినప్పుడల్లా బురదమయంగా మారి నడవటానికి కూడా ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో ఆర్టీసి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుంది.

సత్కరిస్తున్న కార్పొరేటర్ పద్మావతి

రిటైర్డ్ మున్సిపల్ కార్మికులకు సత్కారం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపాల్టీలో ఉద్యోగ విరమణ పొందిన కార్మికులను ఎపి మున్సిపల్ ఎంప్లాయిస్ మరియు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కౌన్సిలర్ చింతకాయల పద్మావతి చేతుల మీదుగా గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా చింతకాయల పద్మావతి మాట్లాడుతూ, నర్సీపట్నం మున్సిపాల్టీకి ఇంతకాలం సేవలు అందిన ప్రతి వర్కరికి అభినందనలు తెలిపారు. విశ్రాంత జీవితం సంతోషంగా గడవాలని ఆకాంక్షించారు. కార్మికుల కుటుంబాల క్షేమం కోసం మున్సిపాల్టీ, పాలకవర్గం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ పొందిన కార్మికుల సేవలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుపరాల రాజు, శ్రీను, రమణ పాల్గొన్నారు.

ఎంపిడిఒను సత్కరిస్తున్న సిబ్బంది

డిప్యూటీ ఎంపిడిఒగా బాబూరావు

ప్రజాశక్తి-గొలుగొండ:మండల డిప్యూటీ ఎంపీడీవోగా డి.బాబురావు గురువారం బాధ్యతలు చేపట్టారు. కశింకోట మండలం బయ్యవరం పంచాయతీకి గ్రేడ్-1 కార్యదర్శిగా పని చేసి పదోన్నతిపై గొలుగొండ వచ్చారు. ఎంపీడీఓ మేరీ రోజ్, ఈఓ మహేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, కార్యదర్శులు సన్మానం చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

పిఎసిఎస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

అభినందిస్తున్న నేతలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మండలంలోని చెట్టుపల్లి పిఏసిఎస్ చైర్మన్ అప్పికొండరాజు, డైరెక్టర్లుగా ఊడి వెంకట గణేష్, కలిమి సత్తిబాబు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రైతులకు రుణాలు, ఎరువులను సకాలంలో అందిస్తామన్నారు. పిఏసిఎస్ ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలాన్ని వ్యాపార సముదాయంగా మార్చి సంస్థకు ఆదాయం చేకూర్చటంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని అన్నారు. జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు ఊడి చక్రవర్తి మాట్లాడుతూ, త్రిసభ్య కమిటీలో జనసేనకు స్థానం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద గజాల సూరిబాబు, మాజీ సర్పంచ్ అగ్రహారపు రమణ, జనసేన సీనియర్ నాయకులు మోపాడ సత్యప్రసాద్, తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మట్ట సతీష్, జనసేన రాష్ట్ర రెల్లి సంఘ నాయకులు ఎర్రంశెట్టి పాపారావు, భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు అప్పలనాయుడు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

మొక్కను నాటుతున్న బుజ్జి

ప్రజాశక్తి -నక్కపల్లి:పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని నక్కపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్చార్జ్ కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. ఉపమాక - నక్కపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రోడ్డు ఇరువైపులా నీడనిచ్చే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలుష్య నివారణ, మానవాళికి కావలసిన ప్రాణవాయువును అందించే శక్తి వృక్షాలకే ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలు, పెద్దలు పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే పద్ధతిని అలవర్చుకోవాలన్నారు. ఉపమాక పుష్కరిణి చుట్టూ ఔషధ గుణాలు కలిగిన మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రగడ వీరబాబు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి జగదీశ్వరరావు (శ్రీను), నాయకులు వాసు, వరహాలరావు కనకరాజు, జనసేన నాయకులు అప్పారావు, వి ఆర్‌పి శ్రీను పాల్గొన్నారు.

మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

మంచినీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి : రావికమతం:మండలంలో కవగుంట పంచాయతీ శివారు బుడ్డిబంద గ్రామంలో మరమ్మతుకు గురైన చేతిపంపు బోరును గురువారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి సూర్యకుమారి అధికారుల దృష్టికి తీసుకువెళగా తక్షణమే స్పందించిన వారు మెకానిక్‌తో మరమ్మతులు చేపట్టారు.. గ్రామంలో రామాలయం వెనుక ఉన్న ఈ చేతి పంపు నీరు గ్రామంలో ఎక్కువమంది వాడుతుంటారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిముడు గంగాభవాని, మాజీ ఎంపిటిసి గుళ్ల వరహాలు దొర, మాజీ వార్డు మెంబరు గుళ్ల దాలయ్య దొర, కిముడు వరహాలు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, సిబ్బంది

సచివాలయ ఉద్యోగులకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో రెండు సచివాలయాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సచివాలయ ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు పలికారు, సచివాలయ కార్యదర్శి నరసింహ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెపిఎస్ సురేష్ నాయుడు, పెబిలి దేవా, ఏఎన్ఎస్ రామకృష్ణ, వెదుర్ల నాగజ్యోతి, అనిమిరెడ్డి భారతి, మిడతల గీత ఎం కృష్ణ, కాళ్ల పార్వతమ్మ బదిలీ అయిన వారిలో ఉన్నారు. వీరికి సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్లు అనిల్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ అప్పారావు

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-మాడుగుల: విధి నిర్వహణలో అధికారులందరూ సమయపాలన పాటించి సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో పనిచేయాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. గురువారం మండలంలో జంపెన, ఎం.కోడూరు, శంకరం, పొంగలిపాక పంచాయతీలలో సచివాలయాన్ని, సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం యం.కోడూరులో సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

తడి పొడి చెత్తను సేకరించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో వేంపాడు పంచాయతీ శివారు వేంపాడు కొత్తూరులో పారిశుద్ధ్య పనులను గురువారం ఎంపీడీవో డి సీతారామరాజు పరిశీలించారు. ప్రతిరోజు ఇంటింటా తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. తడి పొడి చెత్త సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్య నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం శ్రీను పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

పశువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: పాడి పశువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కాలానుగుణంగా వ్యాధి నిరోధక టీకాలతో పాటు గర్భకోశ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం పశువైద్యశాల సహాయ సంచాలకులు రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం సహాయ సంచాలకులు రాంబాబు అధ్యక్షతన శాఖపరమైన సమీక్ష స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం పశుసంవర్ధక శాఖ వేస్తున్న వ్యాధి నిరోధక టీకాలను వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు లోకుల రమేష్ ,పుష్ప, నరేష్, దుర్గాప్రసాద్, సురేష్, శిరీష పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డిగా చలపతిరావు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి మండల ఇఓపిఆర్డి గా కె చలపతిరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆనందపురం మండలంలో పంచాయతీ కార్యదర్శి గా పనిచేసి, పదోన్నతిపై నక్కపల్లి బదిలీ పై వచ్చారు. ఇప్పటివరకు వేంపాడు పంచాయతీ కార్యదర్శి ఎం శ్రీను ఇన్చార్జి ఇఓపిఆర్‌డిగా విధులు చేపట్టారు. ఆయన దగ్గర నుండి చలపతిరావు బాధ్యతలు స్వీకరించారు.

26, 27న సిఐటియు విశాఖ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిఐటియు విశాఖ జిల్లా 13వ మహాసభలు ఈ నెల 26, 27 తేదీలలో కంచరపాలెంలోని కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్నాయని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. గురువారం జగదాంబ దరి సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి 42 వేల సభ్యత్వానికి ప్రాతినిథ్యం వహిస్తూ 300 మంది వివిధ రంగాలు, సంఘాలు, ప్రాంతాలకు చెందిన ఎంపిక చేసిన ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు హాజరవుతారని తెలిపారు. గత మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో చేసిన వివిధ కార్మిక పోరాటాలను, ఉద్యమాలను సమీక్షించుకొని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు, ఆందోళనలు రూపొందించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తామని తెలిపారు. కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్‌పైనా, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత సాధనపైనా, ఇతర కార్మిక సమస్యలపైనా మహాసభలో చర్చించి కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. మహాసభల జయప్రదం కోసం ప్రజలు, కార్మికులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శులు బి.జగన్, పి.మణి, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, కెఎం.కుమార మంగళం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్

నిరసన చేపడుతున్న నేతలు, గిరిజనులు

ఉపాధ్యాయున్ని నియమించాలి

-గిరిజనుల నిరసన

ప్రజాశక్తి -కోటవురట్ల: గొట్టువాడ శివారు గిరిజన గ్రామమైన అణుకు గ్రామానికి ఉపాధ్యాయుడిని నియమించాలంటూ గిరిజనులు గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు డేవిడ్రాజు మాట్లాడుతూ, పాఠశాల ప్రారంభించి దాదాపు రెండు నెలలు కావస్తున్నా నేటికీ గ్రామానికి ఉపాధ్యాయుడిని కేటాయించలేదన్నారు. గిరిజనులు అంటే ఇంత చులకన భావం తగదంటూ మండి పడ్డారు. తక్షణమే ఉపాధ్యాయుడిని కేటాయించి రహదారి ఏర్పాటుకు చర్యలు తీసు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి -కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాలలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పి.హెచ్.సి వైద్యులు సంతోష్ కుమార్ తెలిపారు, మండలంలో పలు గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. గడిచిన వారం రోజులుగా గ్రామాలలో ప్రాంతాలవారీగా శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవిధంగా ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమల నివారణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి కాచి చల్లార్చిన నీళు తాగాలని కోరారు.

సమావేశానికి హాజరైన విద్యార్థులు

పాలిటెక్నిక్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి -కోటవురట్ల: మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం 2025-26 విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ రావు మాట్లాడుతూ, పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు సృజనాత్మకత, నైపుణ్యంతో అనుభవజనులైన అధ్యాపకులచే విద్యాబోధన నేర్చుకోవాలన్నారు. లేబరేటరీస్ అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ టి శ్రీనివాసరావు, ఆర్ ప్రసాదరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాయి గణపతిలో సిజిఆర్‌ఎఫ్‌పై సదస్సు

మాట్లాడుతున్న సిజిఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆనందపురం: గిడిజాల గ్రామంలోని సాయి గణపతి పాలిటెక్నిక్ అండ్ ఇంజినీరింగ్ కాలేజీలో కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం (సిజిఆర్‌ఎఫ్)పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార విధానాలు, విద్యుత్ భద్రత, సౌర విద్యుత్ ప్రోత్సాహంపై చర్చించారు. ఈ సందర్భంగా సిజిఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ, సిజిఆర్‌ఎఫ్ ప్రధాన బాధ్యతలు, వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమస్య పరిష్కారం కాకపోతే విశాఖపట్నంలోని ఇపిడిసిఎల్ కార్యాలయంలో ఉన్న సిజిఆర్‌ఎఫ్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (టెక్నికల్) బి.ధర్మరాజు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ నెట్‌వర్క్‌లో సమస్యలు ఎదురైనప్పుడు వాటిని ఎలా గుర్తించాలి, ఏ విధంగా స్పందించాలి అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిజిఆర్‌ఎఫ్ సభ్యుడు ఎస్.రాజబాబు, కాలేజీ ప్రిన్సిపల్ ఎల్.మహేశ్వరరావు, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి వై.స్వామినాయుడు, ఎడిఇ ఎస్.రాజశేఖర్, ఎఇ మండల అప్పలనాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపైన 1912కు కాల్ చేయండి

పద్మనాభం : విద్యుత్ సమస్యలపై 1912 కాల్ చేసి సమస్యను పరిష్కారం చేసుకోవచ్చని వినియోగదారుల న్యాయస్థానం జడ్జి బి.సత్యనారాయణ తెలిపారు. మండల ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం విద్యుత్తు వినియోగదారుల సమస్యలపై సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్‌కు సంబంధించిన ఎటువంటి చిన్న సమస్య అయినా ఫోన్ ద్వారా పరిష్కారం చేసుకునే మార్గం కల్పించినట్లు తెలిపారు. 11 జిల్లాల పరిధిలో పనిచేస్తున్నామని ఇప్పటివరకు 8991 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. 214 సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ద్వారా 666 కేసులు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. అనంతరం విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదులు తీసుకున్నారు వివిధ రకాల సమస్యలపై 25 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మోహన్, విద్యుత్ వినియోగదారులు నందేశ్వరరావు, దామోదరరావు, కె.రమణ, పి.శ్రీను పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ పద్మావతి

ఏరియా ఆసుపత్రిలో తనిఖీలు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని గురువారం ఉదయం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి, వార్డు కౌన్సిలర్, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యురాలు చింతకాయల పద్మావతి ఆకస్మికంగా సందర్శించి విస్తతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రిలోని ప్రతి వార్డును సందర్శించి, శానిటేషన్ పరిస్థితులను పర్యవేక్షించారు. ప్రతీ వార్డులోని మరుగుదొడ్లు, చేతులు కడుకుకునే ప్రాంతాల పరిశుభ్రతను స్వయంగా పరిశీలించారు. తాగునీటి వద్ద శుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం డయాలసిస్ వార్డును సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్యం, సదుపాయాలపై ఆరా తీశారు. ఇటీవలి కాలంలో ఆసుపత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ అంశాలపై పలు ఫిర్యాదులు వస్తున్న విషయాన్ని ఆమె ప్రస్తావిస్తూ, ఇకపై అటువంటి ఫిర్యాదులకు ఆస్కారం ఉండకూడదని ఆసుపత్రి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందు బాటులో ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

క్వారీ అనుమతులు రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి -కోటవురట్ల: మాకవరపాలెం మండలం జి.కోడూరులో క్వారీ అనుమతులు రద్దు చేయాలని గురువారం క్వారీ ఎదుట నిరసన చేపట్టారు, సిపిఎం నాయకులు చిరంజీవి, ఎఐబిఎస్‌పి నాయకులు బుట్ట నాగరాజు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల తహసిల్దార్, ఆర్డీవోకి వినతి పత్రం అందజేశామని, తూతూ మంత్రంగా గ్రామ రెవెన్యూ అధికారులతో, విలేజ్ సర్వేలతో విచారణ చేపట్టారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ చేపట్టి పర్మిషన్లను నిలిపివేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రాంత రైతులతో పాటు అప్పారావు, గణేష్, లోవరాజు, లక్ష్మీ పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న నాయకులు, గ్రామస్తులు

జ్వరాలు తగ్గే వరకూ వైద్య సేవలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి -నాతవరం: గ్రామాల్లో పూర్తిగా జ్వరాలు తగ్గేవరకు వైద్య సేవలు అందించాలని నర్సీపట్నం ఆర్డిఓ వివి రమణ అధికారులను ఆదేశించారు. మండలంలో మాధవనగరం, చమ్మచింత, సరుగుడు గ్రామాలలో ఆయన పర్యటించారు. సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరి శుభ్రంగా ఉండేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజలపక్షం
కావలెను
ప్రతిష్టాత్మక దినపత్రిక ప్రజాశక్తికి ఈ కింది కేంద్రాల్లో విలేకర్లు కావాలి.
అభ్యర్థులకు తెలుగులో రాయగల రచనా సామర్థ్యం, రాయాలనే ఆసక్తి, సామాజిక స్పృహ ఉండాలి

విశాఖపట్నం జిల్లా
- సింహాచలం
- సింథియా
- మద్దిలపాలెం
- కూర్మన్నపాలెం
- సిరిపురం
- కంచరపాలెం
- తగరపువలస

అనకాపల్లి జిల్లా
- మాకవరపాలెం
- యలమంచిలి రూరల్
- ఎస్.రాయవరం

ఉద్యోగ అవకాశాలు
అనకాపల్లి జిల్లా కేంద్రం విలేకరి
ఎడివిటి గాజువాక జోన్ ఇన్‌ఛార్జి
జాబ్‌వర్క్ ఎగ్జిక్యూటివ్
అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత
ఇంటర్వ్యూ : తేది : 18-07-2025 శుక్రవారం ఉదయం 10 గం॥ల నుండి
అడ్రస్ : ప్రజాశక్తి కార్యాలయం,
ప్లాట్ నెం.3 'జి' బ్లాక్, ఇండస్ట్రీయల్ పార్క్, వడ్లపూడి, ఆటోనగర్, విశాఖపట్నం-46
సెల్ : 9491570765, 9490099125